క్లుప్తంగా

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



వేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: మే డే వారోత్సవాల్లో భాగంగా 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద గురువారం వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా కార్మికుల సమస్యలపై, పోరాట యోధులపై రచించిన పాటలకు స్థానికంగా గల పలువురు చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జిల్లా సీఐటీయూ నాయకుడు ఎం.జగ్గునాయుడు, మల్కాపురం జోన్ కమిటీ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కార్మిక చట్టాల సాధనకు నాయకులు చేసిన పోరాటాన్ని వివరించారు. అనంతరం నృత్య ప్రదర్శన ద్వారా ఆహూతులను అలరించిన చిన్నారులకు జ్ఞాపికలను అందించారు.

కంచరపాలెం రైతుబజార్‌లో కొత్త దుకాణాల నిర్మాణం



రైతుబజార్‌లో నిర్మిస్తున్న దుకాణాలు

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లోని నేల దుకాణాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు మోక్షం కలిగించారు. ఇటీవల వార్తా పత్రికల్లో నేలబారు దుకాణాలు అంటు కథనాలు వెలువడటంతో ఆ దిశగా అధికారులు స్పందించారు. దుకాణాల నిర్మాణానికి టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు ప్రారంభించారు. నేల దుకాణాలకు షెడ్లు, అదనపు దుకాణాలు నిర్మిస్తునట్లు కంచరపాలెం రైతుబజార్ ఈవో జగదీశ్వరావు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రైతులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

యువకుడి అదృశ్యం



తరుణ్ కుమార్ (ఫైల్)

గోపాలపట్నం: బయటకు వెళ్లివస్తానని చెప్పిన కుమారుడు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఎయిర్‌పోర్టు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ జంక్షన్ గౌరినగర్‌లో నివాసముంటున్న బోర తరుణ్ కుమార్ (20) మూడు నెలలుగా కాకినాడలో బేకరీ షాపులో పని చేస్తున్నాడు. ఈ నెల 5న కాకినాడ నుంచి విశాఖ వచ్చిన తరుణ్ 6న ఉదయం 10 గంటల సమయంలో స్నేహితులతో బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో స్నేహితుల నుంచి వివరాలు సేకరించగా.. మద్యం సేవించిన తర్వాత తరుణ్ రైలు ఎక్కి కాకినాడ వెళ్లాడని చెప్పారు. అయితే తరుణ్ కాకినాడ చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పైగా మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆచూకీ తెలియడం లేదని వాపోతున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సంశూన్నీసా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. పురోహిత సంఘ ప్రతినిధి ఆర్.రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా మాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. క్రిస్టియన్ సమాజ ప్రతినిధులు రెవరెండ్ ఇమ్మానుయేల్ సువర్ణరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికలు బాల్యాన్ని, విద్యను కోల్పోతున్నారని, వీటిని ప్రోత్సహించరాదన్నారు. బాల్య వివాహాల నిషేధానికి కృషి చేస్తామని ధార్మిక సంఘ నాయకులంతా ప్రతిజ్ఞ చేశారు. రెవరెండ్ సూర్య కిరణ్, చక్రవర్తి, కె.వై.రత్నం పాల్గొన్నారు.

ఇంత అధ్వానమా?



తోటవీధి నుంచి దుర్గానగర్‌కు వెళ్లే రైల్వేట్రాక్ రహదారిలో ఔట్‌లెట్ ఇవ్వకుండా మూసేసిన యూజీడీ లైన్లు

- అస్తవ్యస్తంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ
- తరచూ లీక్ అవడంతో భరించలేని దుర్గంధం
- ఔట్‌లెట్లు లేక మరీ దుర్భరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు



యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న పిట్ వ్యర్థాలు (ఫైల్)



దుర్గానగర్‌లో లీక్ అవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్స్

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు, వ్యర్థాలు రోడ్డుపైకి చేరుకోవడంతో ఒకవైపు దుర్గంధంతో, మరోవైపు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధి దుర్గానగర్, తోటవీధి, పల్లివీధి, చెవిటిరాముల వీధి, గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారి గౌరీనగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, భవాని గార్డెన్స్, శ్యామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ ప్రమాదభరితంగా మారాయి. మరికొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవల రోడ్లు నిర్మించి, మ్యాన్‌హోల్స్ ఎత్తు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షాలకు మ్యాన్‌హోల్స్‌లో వర్షపు నీరు భారీగా చేరి, వ్యర్థాలు బయటకు వచ్చి పరిసరాలు అధ్వానంగా మారాయి. దుర్గంధంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎగువ నుంచి యూజీడీ పైప్‌లైన్లు వేసి, ఔట్‌లైన్ కనెక్షన్లు ఇవ్వడం మరిచిపోయారు. దీంతో యూజీడీ మాన్యువల్ గోతుల్లో మురుగు నీరు, పిట్ వ్యర్థాలు రహదారిపైకి చేరుతోంది. ఇక్కడి నిర్మించిన యూజీడీలకు సక్రమమైన ఔట్‌లెట్‌లు లేకపోవడంతో ఆ వ్యర్థాలు రహదారుల పైకి వస్తున్నట్లు శానిటరీ సిబ్బంది చెబుతున్నారు.

వర్షాలు పడితే ఇక అంతే..

వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వ్యర్థాలు, మురుగు రోడ్లపైకి చేరడంతో పారిశుద్ధ్య సిబ్బందికి రోడ్లు, కాలువలు ఊడ్చే పని ఎక్కువ అవుతోంది. ఇక్కడి సమస్యలపై వార్డు కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, ముర్రు వాణి నానాజీలకు స్థానికులు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు సార్లు వరుసగా ఎన్నికైన ఎమ్మెల్యే గణబాబు ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో పర్యటించకపోవడంతో అధికారుల్లో చలనం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జోన్–5 యూజీడీ అధికారులు పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

> **దుర్గంధం భరించలేకపోతున్నాం**
>
> వార్డులోని యూజీడీ పైప్‌లైన్లు లీక్ అవడంతో పరిసరాలు అధ్వానంగా ఉంటున్నాయి. రోడ్లపై నడవలేకపోతున్నాం. దుర్గంధం భరించలేకపోతున్నాం. శిథిలావస్థలో ఉన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలి.
>
> – పి.వెంకటలక్ష్మి, దుర్గానగర్, కంచరపాలెం

> **అధికారులు స్పందించాలి**
>
> యూజీడీ పైప్‌లైన్ పనులు చేపట్టినప్పుడు ప్రధాన రహదారుల్లో బాగానే నిర్మించారు. కాలనీ వీధుల్లోకి వచ్చేసరికి సక్రమంగా వేయకపోవడంతో యూజీడీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా మారుతున్నాయి. జోన్–5 యూజీడీ అధికారులు స్పందించాలి.
>
> – ఎస్.గోవిందరాజు, తుమ్మడపాలెం, ఐటీఐ జంక్షన్

సమ్మె పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

మల్కాపురం: దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన జరగనున్న సమ్మెను అంతా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం తదితర నాయకులు పిలుపునిచ్చారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ కార్మిక హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తూ, కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకుండా, పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు యత్నిస్తోందని విమర్శించారు. పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను దళితులగానే గుర్తించాలి

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్

విశాఖ విద్య: దళిత క్రైస్తవులను దళితుల గానే గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలని కోరారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ డీహెచ్‌పీఎస్, కేయూపీఎస్, ప్రజా సంఘాలు, దళిత క్రైస్తవులు ఎన్ఏడీ కొత్త రోడ్ దరి అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం శాంతియుత నిరసన చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ క్రైస్తవ మతంలోకి మారిన మరుక్షణమే ఎస్సీ హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విచారకరమన్నారు. దళితులు ఏ మతంలోకి మారినా వివక్షకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ సంఘాల నాయకుడు పి.జాకబ్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికీ మత స్వేచ్ఛ కల్పించిందని, దళిత క్రైస్తవులను దళితులుగానే గుర్తించాలని కోరారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజులు మాట్లాడుతూ ఆర్టికల్ 25 ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన మతాన్ని స్వీకరించవచ్చన్నారు. జిల్లా కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ బౌద్ధంలోకి, సిక్కు మతంలోకి మారితే లేని అభ్యంతరాలు క్రైస్తవ మతంలోకి మారితే ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆనంద్, నవీన్, శ్రీనివాస్, జయరాజు, శ్రీ కుమార్, ఆంథోనీ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

10న ఉచిత వైద్య శిబిరం

గోపాలపట్నం: సాధన గ్రూప్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ ఆస్పత్రిలో ఈ నెల 10న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి చైర్మన్ సత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో జనరల్, ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలతో పాటు బీపీ షుగర్ పరీక్షలు, ఎక్స్‌రే ఉచితంగా తీస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98495 11544, 95533 55821, 63010 79746 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పొగ కమ్మేస్తోంది



రామ్‌నగర్ నుంచి కనిపిస్తున్న పొగ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శివారు ప్రాంతాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. ఈ పొగ సమీప ప్రాంతాలను కమ్మేస్తూ, అక్కడి నివాసితులకు అనారోగ్య సమస్యలు తెచ్చి పెడుతోంది. వార్డు పరిధి రామ్‌నగర్ శివారు ప్రాంతంలో నిర్లక్ష్యంగా డంప్ చేసిన చెత్తకు నిప్పు పెట్టడంతో తెల్లని పొగ దట్టంగా వ్యాపిస్తోంది. ఈ పొగ రామ్‌నగర్, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాలకు వ్యాపిస్తూ, అక్కడ నివసిస్తున్న వారికి ఊపిరి ఆడనివ్వని పరిస్థితి కల్పిస్తోంది. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని రామ్‌నగర్ ప్రాంతవాసులు కోరుతున్నారు.

శతకాలతో చిన్నారుల్లో నైతిక విలువలు



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వనాథ్‌రాజు

మల్కాపురం: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేందుకు సుమతీ శతకం, వేమన శతకం, కుమారీ శతకం, భాస్కర శతకం ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ న్యాయవాది జి.కె.విశ్వనాథ్‌రాజు అన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచి వీటిని అభ్యసించాలని సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచి శతక పద్యాలు, వాటి తాత్పర్యాలు నేర్పాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రింగ్‌లైట్ల స్తంభం ఏర్పాటు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగం ఏఈ అర్చన పర్యవేక్షణలో రింగ్ లైట్ల పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి జేసీబీ సహాయంతో కొత్తది అమర్చారు. ఈ పనులను కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ పరిశీలించారు. ప్రజలకు విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


వైభవంగా ధ్వజ స్తంభం పునఃప్రతిష్ట



ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల శివన్నామస్మరణ నడుమ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గవ్యాంత పూజలు, శేష హోమాలు, యంత్రార్చన, బలిహరణ, యంత్రస్థాపనం, గోదర్శనం, కళాన్యాసములు, కుంభాభిషేకం జరిపించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మర్రిపాలెం: ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జాతికి, జంతుజాలానికి కలిగే అనర్థాలపై జీవీఎంసీ అధికారులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50వ వార్డులోని పలు షాపుల యజమానులు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.